క్లుప్తంగా

పారిజాతగిరిలో హుండీ లెక్కింపు

జంగారెడ్డిగూడెం : స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. ఏలూరు శనివారపుపేట గ్రూప్ టెంపుల్స్ ఈవో పి.రీనామాధురి పర్యవేక్షణలో హుండీ లెక్కింపు నిర్వహించినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. ఈ లెక్కింపులో 96 రోజులకు గాను రూ. 8,64,542 ఆదాయం వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు పి.జగపతిరాజు, దండు ధనరాజు, రెడ్డి రంగప్రసాద్, ములగలంపల్లి సేవా సమితి బృందం, భక్తులు పాల్గొన్నారు.

రోటరీ విశేష సేవలకు పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న దాకారపు కృష్ణ, రాంగోపాల్

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం రోటరీ క్లబ్‌కు 2022 – 23 సేవా సంవత్సరంలో చేసిన సేవలకు పురస్కారాలు లభించాయి. రోటరీ జిల్లా గవర్నర్ విశ్వనాధం భాస్కరరావు ఈ పురస్కారాలను అందజేశారు. బెస్ట్ ప్రెసిడెంట్‌గా దాకారపు కృష్ణ, బెస్ట్ కార్యదర్శిగా ఉడా రాంగోపాల్‌తో పాటు ఆయా అంశాలకు మరో 10 పురస్కారాలు లభించాయి. రోటరీ సభ్యులు విజయనగరం ఎస్ కన్వెన్షన్‌లో జరిగిన రోటరీ జిల్లా 3020 పురస్కారాల ప్రధాన కార్యక్రమం ×అంబర్జ లో జిల్లా అవార్డ్స్ చైర్మన్ డాక్టర్ ఎం.పద్మ కుమారి ఆధ్వర్యంలో జిల్లా గవర్నర్ విశ్వనాధం భాస్కరరాం చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా సభ్యులను రోటరీ జంగారెడ్డిగూడెం చార్టర్ సభ్యులు, దాతలు, స్నేహితులు అభినందించారు.

రెడ్‌క్రాస్ సేవలు విస్తరించేలా కృషి



ఎంపీడీవోకు కమిటీల ఏర్పాటు పత్రాలను అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలు విస్తరించే విధంగా ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా కార్యదర్శి బి.బిన్నీ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ కమిటీలను జిల్లాలోని అన్ని మండలాల్లో ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. మండల స్థాయి కమిటీల్లో తహసీల్దార్ కమిటీ అధ్యక్షులుగా, ఎంపీడీవో ఉపాధ్యక్షులుగా వ్యవహరిస్తారని అన్నారు. కమిటీల ఏర్పాటుకు సంబంధించి పత్రాలను ఎంపీడీవో వేణు గోపాలరెడ్డికి అందజేశారు. రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ గణపతి హోమం

జంగారెడ్డిగూడెం రూరల్ : అయ్యప్ప స్వామి జన్మనక్షత్రం ఉత్తరా నక్షత్రం కావడంతో మండలంలోని గురవాయిగూడెం శ్రీఅయ్యప్పస్వామి క్షేత్రంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గూడూరు వెంకట శివరామకృష్ణ స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. వేద మంత్రాలతో లక్ష్మీగణపతి హోమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి నూతన భవనం నిర్మించాలి

కామవరపుకోట : కామవరపుకోట శాఖా గ్రంథాలయానికి స్థలం కేటాయించి నూతన భవనం నిర్మించాలని గ్రంథాలయాధికారి ఎం భీమరాజు, గ్రంథాలయ రీడర్స్ ఫోరం ప్రతినిధి టీవీఎస్ రాజు కోరారు. ఈమేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ డీవీ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక శాఖ గ్రంథాలయాన్ని సుదీర్ఘకాలంగా అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నామని, కనీస సదుపాయాలు లేక పాఠకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



జంగారెడ్డిగూడెం : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రాజేష్



కామవరపుకోట : అడమిల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



చింతలపూడి : ర్యాలీలో పాల్గొన్న జడ్జి మధుబాబు, పోలీసులు



పోలవరం రూరల్ : విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాల్సిన యువత మాదక ద్రవ్యాల బారిన పడి జీవితం నాశనం చేసుకోవడం చాలా బాధాకరమని జంగారెడ్డిగూడెం పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.రాజేష్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం శ్రీ దామోదరం సంజీవయ్య జూనియర్ కళాశాల వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు స్వల్పకాలానికి ఉల్లాసాన్ని కల్పించినా, దీర్ఘకాలంలో శారీరిక, మానసిక రుగ్మతలను కలుగజేస్తాయన్నారు. దీని వల్ల వ్యక్తిగత జీవితంతో పాటు, కుటుంబ జీవితం కూడా నాశనం అవుతుందని, కావున యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఈ కార్యక్రమానికి జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, న్యాయవాదులు మాదక ద్రవ్య నిరోధక చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, న్యాయవాదులు మోదేపల్లి నాగులు, పిల్లి పెద్దిరాజు, బల్లే సాయికుమారి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు

దేశానికి వెన్నుముక అయిన యువత మత్తు పదార్థాల బారిన పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జంగారెడ్డిగూడెం సీఐ పి.రాజేష్ అన్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, జంగారెడ్డిగూడెం డీఎస్పీ ధనంజయరెడ్డి ఆదేశాలపై జంగారెడ్డిగూడెం సీఐ పి.రాజేష్, ఎస్ఐ సాగర్‌బాబు, సిబ్బందితో కలిసి విద్యావికాస్ కాలేజ్ విద్యార్థిని విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై సోమవారం అవగాహన సదస్సును నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఎవరైనా మత్తు పదార్థాలను సేవించినా లేదా అమ్మినా దగ్గరలో ఉన్న పోలీస్ వారికి గాని లేదా టోల్ ఫ్రీ నెంబర్ 14500కు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

చింతలపూడి : మాదక ద్రవ్యాల వినియోగం సమాజాభివృద్ధికి గొడ్డలిపెట్టుగా మారుతుందని, యువత మాదకద్రవ్యాల జోలికి పోవద్దని చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి ఈ.మధుబాబు అన్నారు. చింతలపూడి పోలీస్, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. జడ్జి మధుబాబు మాట్లాడుతూ విద్యార్థి దశలో సరదాగా అలవాటై, తదుపరి జీవితాన్ని నాశనం చేసేదిశగా మాదక ద్రవ్యాల వ్యసనం ఉంటోందన్నారు. గంజాయి, మత్తు పదార్థాల నిరోధానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. చింతలపూడి సీఐ ఎంపీఎస్ మల్లేశ్వరరావు, ఎస్సై డి.హరికృష్ణ, ఎక్సైజ్ సీఐ సుంకర సాయిస్వరూప్, సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

పోలవరం రూరల్ : మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎస్ఈబీ సీఐ జె.శ్రీనివాస బాలాజీ అన్నారు. పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల, హైస్కూల్‌లో విద్యార్థులకు మత్తు పదార్థాల వాడకం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఎస్సై ఎం.శ్యామ్‌బాబు, సిబ్బంది, హైస్కూల్ హెచ్ఎం స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో.. మంచి భవిష్యత్తు

కామవరపుకోట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఐక్యూఏసీ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా డ్రగ్స్ నివారణపై ఆడమిల్లి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో భవిష్యత్తుని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయవాది అచ్యుత శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పారాలీగల్ వలంటీర్ వీరమళ్ళ మధు, అధ్యాపకులు డాక్టర్ జి శ్రీనివాసరావు, జి.రామ్మోహన్, వి.శ్రీనివాస్, ధారావతు మల్లేష్, నజ్మా, కుమార్ రాజా పాల్గొన్నారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

బుట్టాయగూడెం : మండలంలోని అచ్చియ్యపాలెం సచివాలయం పరిధిలోని కంద్రికగూడెంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలరాజు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకుంటారని అన్నారు. అదేవిధంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తారని చెప్పారు.

నేడు ధర్మాజీగూడెంలో...

లింగపాలెం : ధర్మాజీగూడెంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా హాజరై ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారన్నారు.

వ్యక్తి అరెస్ట్

జంగారెడ్డిగూడెం : విద్యుత్ ఉద్యోగిని కొట్టి గాయపర్చిన నేరంపై ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. జంగారెడ్డిగూడెం ఓ బార్‌లో విద్యుత్ ఉద్యోగిపై కొందరు వ్యక్తులు దాడి చేసి గాయపర్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. తాజాగా సోమవారం కేసులో నిందితుడైన ఆరవ వ్యక్తి జంగారెడ్డిగూడెంకు చెందిన షేక్ నాగుల్‌మీరాను అరెస్టు చేసినట్లు ఎస్సై చెప్పారు.

అర్హులను గుర్తించేందుకే జగనన్న సురక్ష



కొయ్యలగూడెం : సమావేశంలో జగనన్న సురక్షపై వివరిస్తున్న సర్పంచ్ శాంతకుమారి



పోలవరం రూరల్ : జగనన్న సురక్ష సర్వేను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో సత్యనారాయణ

కొయ్యలగూడెం: అర్హత ఉన్న అందరికీ లబ్ధి చేకూర్చేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నారని సర్పంచ్ సున్నం శాంతకుమారి పేర్కొన్నారు. దిప్పకాయలపాడు గ్రామంలోని రామాలయం వద్ద సోమవారం జగనన్న సురక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతకుమారి మాట్లాడుతూ ఇప్పటికే గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ విజయవంతం కాగలిగామని అయినప్పటికీ ఏదో మూల లబ్ధి చేకూరని వ్యక్తులు కానీ కుటుంబాల వారు కానీ ఉంటారని అటువంటి వారిని గుర్తించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పథకాలు అన్నీ కూడా లబ్ధిదారులకు అందచేయటమే నెల రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. దిప్పకాయలపాడు గ్రామపంచాయతీలో గిరిజన గ్రామాలు ఉన్నాయని పథకాలు పొందని వారిని గుర్తించడంలో గృహ సారథులు, వలంటీర్లు చురుకైన పాత్ర పోషించాలన్నారు. నాయకులు గిద్దే సూర్యచంద్రం, పూనం కన్నయ్య, బొనగిరి ఆశీర్వాదం, సున్నం వెంకటేశ్వరరావు, నూనె నాగు, కుర్సం మురళి, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పకడ్బందీగా నిర్వహించాలి

కుక్కునూరు : జగనన్న సురక్ష కార్యక్రమం మండలంలో పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర అన్నారు. కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం తహసీల్దార్ ప్రమద్వర, ఎంపీడీఓ శ్రీనివాస్ వలంటీర్, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, జూలై ఒకటిన జగనన్న సురక్ష యాప్ ఓపెన్ అవుతుందన్నారు. యాప్ ఓపెన్ అయిన నాటి నుంచి వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికి తిరిగి ప్రతి ఇంటిని యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సంక్షేమ పథకాలు అందడంలో ఎవరికైనా సమస్యలుంటే టోకెన్‌ని రేయిజ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరం రూరల్ : అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఐటీడీఏ పీవో జీవీవీ సత్యనారాయణ అన్నారు. ఆయన పోలవరం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై జరుగుతున్న సర్వేను పరిశీలించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని ఏ విధంగా యాప్‌లో నమోదు చేస్తున్నారో పరిశీలించారు. వారికి తగు సూచనలు చేశారు. ఏవిధమైన సర్టిఫికెట్‌లు అవసరమైనా లబ్ధిదారుల నుంచి తగినన్ని ఆధారాలు తీసుకుని సర్టిఫికెట్‌లు ఉచితంగా జారీచేయడం జరుగుతుందని తెలిపారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి తప్పనిసరిగా వెళ్లి నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో జి.శ్రీను, పోలవరం పంచాయతీ కార్యదర్శి వై.కొండలరావు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష పథకం పూర్తి విజయవంతంగా నిర్వహించేలా అన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో వేణుగోపాల రెడ్డి, తహసీల్దార్ ఎస్. శారా శాంతి తెలిపారు. జూలై 1వ తేది నుంచి 22 వ తేదీ వరకు బుట్టాయగూడెం మండలంలోని సచివాలయాల పరిధిలో నిర్వహించే జగనన్న సురక్ష అమలుపై కార్యదర్శులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం అమలుకు మండలంలో రెండు బృందాలు గ్రామాల్లో పర్యటించి ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకుంటామని తెలిపారు. అలాగే 11 రకాల ఉచిత సేవలు అందిచడం జరుగుతుందని చెప్పారు.

విద్యాకానుక పంపిణీ



రేచర్ల పాఠశాలలో జగనన్న విద్యాకానుక పంపిణీ చేస్తున్న దృశ్యం

చింతలపూడి : జగనన్న విద్యాకానుకను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని ఎంపీపీ డాక్టర్ రాంబాబు, రేచర్ల సర్పంచ్ శివరామకృష్ణ అన్నారు. రేచర్ల ఎంపీయూపీ స్కూల్‌లో సోమవారం జగనన్న విద్యాకానుక కిట్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. విద్యాకమిటీ చైర్మన్ పార్వతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ, సర్పంచ్‌లు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. జగనన్న వసతిదీవెన, విద్యాదీవెన, విదేశీ విద్య, అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, నాడు–నేడు తదితర కార్యక్రమాల ద్వారా విద్య అందరికీ చేరువయ్యేలా చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో గుత్తా మాధవరావు, హెచ్ఎం ఎస్ఎస్ రాజేంద్ర కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో పులివాగు శివాలయంలో మల్లికార్జునుడు

కొయ్యలగూడెం : ఆషాడ మాసం ప్రథమ సోమవారం సందర్భంగా మండలంలోని పలు శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా పడాలని లింగరూపుడైన మహాదేవునికి జలాభిషేకాలు అర్చకులు, భక్తులు సంయుక్తంగా నిర్వహించారు. పులివాగు శివాలయం శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో అర్చకులు మణికంఠ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ప్రాంగణంలోని వినాయక, కాలభైరవ, ఆంజనేయస్వామి విగ్రహాల వద్ద సామూహిక పూజలు జరిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : యువతి అదృశ్యంపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన యువతి ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటోందని, ఏడాది కాలంగా స్థానికంగా ఉన్న చర్చికు వెళుతోందన్నారు. ఈ క్రమంలో చర్చి వద్ద జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడుకు చెందిన యువకుడు మొడియం ప్రశాంత్‌కుమార్ పరిచయం అయ్యాడని తెలిపారు. యువతి అదృశ్యంపై ప్రశాంత్‌కుమార్‌పై అనుమానం ఉన్నట్లు యువతి తల్లి ఫిర్యాదు చేయడంతో యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు



కొణిజర్లలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

లింగపాలెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాల పథకాలను అమలు చేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. లింగపాలెం మండలం కొణిజర్లలో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఎమ్మెల్యే ఎలీజా, స్థానిక సర్పంచ్ నూజివేటి జయశ్రీ, పార్టీ నాయకులతో కలసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఏమైనా సమస్యలు ఉన్నాయా, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాలను నేరుగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. ప్రజల కష్టాల్ని అర్థం చేసుకునే చిప్ చంద్రబాబుకు లేదని విమర్శించారు. ప్రజలపై ఆయనకు మమకారం, ప్రేమ ఏమాత్రం లేవని, పేదలు ఎదగకూడదన్నదే చంద్రబాబు, దుష్టచతుష్టయం విధానమని వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, మండల వైఎస్సార్ కాంగ్రెస్ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, ధర్మాజీగూడెం సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పలపాటి వరప్రసాద్, లింగపాలెం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొఠారి మోహనరావు, మండల సచివాలయాల కన్వీనర్ అన్నపనేని శాంతరావు, సర్పంచ్‌లు, నాయకులు చలగుళ్ల రవిబాబు, తాడేపల్లి శాంతరావు, డి రవీంద్ర, గ్రామ ఉపసర్పంచ్ లక్కపాము శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా తగ్గిన వర్జీనియా పొగాకు ధరలు



కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో విక్రయానికి ఉంచిన బేళ్లు

కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం : వర్జీనియా పొగాకు ధరలు స్వల్పంగా తగ్గాయి. సోమవారం కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో నిర్వహించిన వేలం ప్రక్రియలో రూ.7 నుంచి రూ.8 మేర ధర తగ్గింది. వేలం ప్రారంభించిన 75 రోజుల నుంచి పెరుగుతూ వెళ్లి 288/287 రూపాయలకు వర్జీనియా ధర చేరుకోగా ప్రస్తుతం సుమారు ఎనిమిది రూపాయలు తగ్గుముఖం పట్టింది. పెరుగుతూ వస్తున్న ధరలను చూసి రూ. 300కు చేరుకుంటుందని ఆశించామని అయితే ఒక్కసారిగా ధర తగ్గించడం పట్ల రైతుల్లో ఆందోళనకు కారణమైందని వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల నంది పేర్కొన్నారు. ధర ఆశాజనకంగా ఉండడంతో మిగిలి ఉన్న పొగాకును ఒక్కసారిగా వేలం కేంద్రానికి తీసుకురావడం జరిగిందని, అయితే పడిపోయిన ధరను చూసి నిరాశ చెందామని రైతులు వాపోతున్నారు. కంపెనీలు సిండికేట్‌గా వ్యవహరించి ధర తగ్గించాయని వారు ఆరోపిస్తున్నారు.

విద్యుత్ సిబ్బంది భద్రతా నియమాలు పాటించాలి



సిబ్బందికి అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈఈ పి.రాధాకృష్ణ

జంగారెడ్డిగూడెం : విద్యుత్ సిబ్బంది విధుల నిర్వహణలో భద్రతా నియమాలను పాటించాలని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ సూచించారు. సోమవారం స్థానిక డివిజన్ కార్యాలయంలో జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించి, అనంతరం వారిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన లైన్ క్లియర్‌పొంది విద్యుత్ మరమ్మతులు నిర్వహించి ప్రమాదాలను అరికట్టాలన్నారు. అలాగే భద్రతా ఉపకరణాలను ఖచ్చితంగా ఉపయోగించాలన్నారు. ప్రామాణికం ఉన్న మెటీరియల్‌ను వినియోగించాలని సూచించారు. సప్లయ్ ఆపకుండా విద్యుత్ ఉపకరణాలపై పనిచేయరాదని సూచించారు. అలాగే గృహ వినియోగదారులు పాటించాల్సిన భద్రత ప్రమాణాలను వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రమాదవశాత్తు షాక్‌కు గురైన వ్యక్తిని రక్షించే సమయంలో బాధితుడిని తాకకుండా ఎండిపోయిన కర్రతో విద్యుత్ తీగలను ప్రమాదానికి గురైన వ్యక్తి నుంచి వేరే చేయాలన్నారు. గృహ వినియోగదారులకు విద్యుత్ షాక్ తగలకుండా ఉండేందుకు ఇళ్లల్లో 30 యాంప్స్ సామర్థ్యం కలిసి ఆర్‌సీసీబీ, ఈఎల్‌సీబీలు వినియోగించాలన్నారు. అలాగే వ్యవసాయ పంప్‌సెట్‌లకు సంబంధించి మోటార్ స్టార్టర్ స్విచ్‌లు ఉన్న ఇనుప బోర్డులకు విధిగా ఎర్తింగ్ చేయాలన్నారు. తడి చేతులతో, నీటిలో నిలబడి విద్యుత్ మోటార్లను స్విచ్‌లను తాకరాదన్నారు. పొలాల్లో తెగిపడిన విద్యుత్ వైర్లకు దూరంగా ఉండి, సంబంధిత విద్యుత్ సిబ్బందికి గాని, గ్రామ సచివాలయంలో ఉన్న ఎనర్జీ సహాయకులకు ఫిర్యాదు చేయాలన్నారు. లేదా టోల్‌ఫ్రీ నెంబర్ 1912కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీ యు.సుబ్బారావు, ఏఈ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టును తొలి దశలో గుర్తించాలి

చింతలపూడి : కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించడం ద్వారా త్వరితగతిన వ్యాధిని నయం చేయవచ్చునని ఆరోగ్య విస్తరణ అధికారి అబ్రార్ హుస్సేన్ పేర్కొన్నారు. సోమవారం నుంచి జూలై 16వ తేదీ వరకు కుష్టు వ్యాధి గుర్తించడంపై జరుగుతున్న సర్వేను ప్రగడవరం, వెలగలపల్లి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ అరుణ అవ్వమ్మ పాల్గొన్నారు.

గుట్టుచప్పుడు కాకుండా ఇసుక అమ్మకాలు

కుక్కునూరు : మండలంలోని పెద్దరావిగూడెం పంచాయతీలో రాత్రివేళల్లో ఇసుక అమ్మకాలు గుట్టుగా సాగుతున్నాయి. పెద్దరావిగూడెం పంచాయతీ పరిధిలోని పాములేరు వాగు తెలంగాణలోని ములకలపల్లి, కుక్కునూరు సరిహద్దు గ్రామాల మీదుగా ప్రవహిస్తుంది. దీనిని అవకాశంగా తీసుకున్న తెలంగాణకు చెందిన కొందరు వ్యక్తులు పాములేరువాగు నుంచి ఇసుకను రాత్రి వేళల్లో గుట్టుగా తరలించి పెద్దరావిగూడెం పంచాయతీలో అమ్మకాలు జరుపుతున్నట్టు సమాచారం. మండల అవసరాల నిమిత్తం ప్రభుత్వం రెండు ఇసుక ర్యాంపులు కేటాయించింది. అయినప్పటికి తెలంగాణ ప్రాంతం వారు మండలంలో ఇసుక అమ్మకాలు జరపడం విస్మయానికి గురిచేస్తుంది. ఆదివారం రాత్రి పది ట్రాక్టర్లలో ఇసుకను వెంకటాపురం పరిసరాలకు తరలించి అమ్మినట్టు సమాచారం. కాగా పక్క రాష్ట్రాల వారు మండలంలో ఇసుక అమ్మకాలు జరపడం బట్టి చూస్తే అధికారుల పర్యవేక్షణా లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తుందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కుక్కునూరు : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వలంటీర్లు ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరవేసేందుకు వలంటీర్లు అహర్నిశలు కృషిచేస్తున్నారన్నారు. వారికిచ్చే గౌరవ వేతనాలు ఆన్‌లైన్ చేయడం సరైన పద్ధతి కాదన్నారు. గతంలో ఆన్‌లైన్‌లో పేర్లు లేవన్న కారణంతో మాధవరం సచివాలయ పరిధిలో పనిచేస్తున్న వలంటీర్ల గౌరవ వేతనాలను ఆపడంతో ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించుకొన్నట్లు చెప్పారు. మరలా పేర్లు ఆన్‌లైన్ చేయడానికి సాంకేతిక లోపాలున్నాయంటూ, మే, జూన్ నెలలకు సంబంధించి గౌరవ వేతనాన్ని ఆపారని చెప్పారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సాంకేతిక సమస్యను పరిష్కరించి వేతనాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో వలంటీర్లు హరినాథ్, మీనా, నవీన్, కమలాకర్, స్రవంతి, అమల, రాధ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలము ప్రకటన

ది మధ్యాహ్నపువారిగూడెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం లి.నెం.WG-704, మధ్యాహ్నపువారిగూడెం

ఏలూరు జిల్లా, టి.నర్సాపురం మండలం, మధ్యాహ్నపువారిగూడెం గ్రామములో గల ది. మధ్యాహ్నపువారిగూడెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం లి.నెం.WG - 704 మధ్యాహ్నపువారిగూడెం నందు ఈ దిగువ తెలిపిన బకాయి బాకీదారులు సదరు సంఘము నందు ఋణము తీసుకొని తిరిగి చెల్లించకపోవుట వలన వారు సంఘమునకు తనఖా పెట్టబడిన స్థిరాస్థులను ఈ దిగువ తెలిపిన తేదిలలో డిప్యూటి రిజిస్ట్రారు/ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి. ఏలూరు వారి ఉత్తర్వుల ప్రకారం ది.01.07.2023వ తేది శనివారం రోజున సీనియర్ ఇన్‌స్పెక్టర్/ సేల్ ఆఫీసర్, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి. కామవరపుకోట వారిచే ది. మధ్యాహ్నపువారిగూడెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం లి.నెం.WG - 704, మధ్యాహ్నపువారిగూడెం ఆఫీసు భవనము నందు ఈ దిగువ తెలిపిన తేదిలో బహిరంగ వేలము వేయబడును. కావున ఆసక్తి గలవారు వేలము పాటలో పాల్గొనవచ్చును.

వ.నెం	ఇ.నెం	ఇ.పి.నెం.	బకాయి బాకీదారుని పేరు	ఆస్తి ఉన్న గ్రామం	సర్వేనెం	విస్తీర్ణం య. సెం	సరిహద్దులు	చెల్లింపవలసిన మొత్తము	వేలము వేయు తేదీ, సమయం, స్థలం
1	320	1607/ 22-23	పాలేపల్లి లక్ష్మీనారాయణ S/o వెంకట రామయ్య గారు [illegible] 1.పాలేపల్లి నరసింహరావు 2.పాలేపల్లి రాంబాబు శ్రీరామవరం గ్రామం	తిరుమలదేవిపేట గ్రామం టి.నర్సాపురం మండలం	814-1 477-2C 527-2 533 Total	Ac 0.16 Ac 0.52 Ac 1.50 Ac 1.50 Ac 4.68 Cts	కలవు	రూ.4,94,358/- దర్బిలా వడ్డీ+ ఇతర ఖర్చులు	ది.01.07.2023 ఉ.11.00లకు మధ్యాహ్నపువారిగూడెం PACS నందు
2	605	1791/ 12-13	[illegible]	గుర్వాయిగూడెం గ్రామం టి.నర్సాపురం మండలం	163/4 164/2 162/2A 162/2C 162/2E Total	Ac 1.92 Ac 2.20 Ac 2.88 Ac 1.48 Ac 2.56 Ac 11.04 Cts	కలవు	రూ.6,58,179/- దర్బిలా వడ్డీ+ ఇతర ఖర్చులు	ది.01.07.2023 ఉ.12.00లకు మధ్యాహ్నపువారిగూడెం PACS నందు

సం/– యర్రా ఏసు కుమార్, సీనియర్ ఇన్‌స్పెక్టర్/ సేల్ ఆఫీసర్ /జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి., ఏలూరు H.O జంగారెడ్డిగూడెం